మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition



తుపాను వచ్చిందంటే చాలు.. ముఖ్యమంత్రి చంద్రబాబు పబ్లిసిటీ పీక్ లెవల్లోకి వెళ్లిపోతుంది. తుపాను తీరం దాటకముందే అద్భుతాలు చేసినట్లు ప్రచారం మొదలవుతుంది. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటుంటే, రైతులు పంటల కోసం ఆందోళన చెందుతుంటే, ప్రభుత్వం మాత్రం ప్రచార ఆర్భాటంలో మునిగిపోయింది. స్థానిక ఎన్నికల్లో దాడులు, దౌర్జన్యాలతో ఆంధ్రప్రదేశ్ 'సౌత్ బిహార్'గా మారిందన్న విమర్శల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు నిన్నటిపరకు వైయస్ జగన్ బెంగళూరు నివాసాన్ని తెరపైకి తెచ్చిన చంద్రబాబు, ఇప్పుడు అర్నబ్ తుపానును ప్రచార వేదికగా మార్చుకున్నారు.

పరిహారం నిల్.. పబ్లిసిటీ ఫుల్!

తుపాను తీరం దాటకముందే చంద్రబాబు అద్భుతాలంటూ ప్రచార హోరు!

స్థానిక ఎన్నికల అరాచకాల నుంచి డైవర్షన్‌కే తుపాను పబ్లిసిటీ

- ముందస్తు చర్యలు అంతంతే.. చివరి రోజు హడావుడి సమీక్షలు
- సీసీ కెమెరాల్లో పరిశీలనలంటూ ప్రచారం.. రైతుల పొలాల్లోకి వెళ్లేదెప్పుడు?
- మొంథాలో 15 లక్షల ఎకరాల నష్టాన్ని 4 లక్షలకే కుదించి రైతులకు దగా
- ఏడాది గడిచినా రైతులకు రూ.600 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ బకాయి
- అర్నబ్ పంటనష్టంపైనా కాకి లెక్కలు.. 70 వేల ఎకరాలకే పరిమితం చేసే కుట్రలు
- వైయస్ జగన్ హయాంలో ఈక్రాప్‌తో నష్టం అంచనా.. ఇప్పుడు ఉచిత పంటల బీమా నిర్వీర్యం
- విజయవాడ వరదల్లోనూ ప్రచారమే.. హామీలు గాలికి.. రూ.500 కోట్ల అవినీతి
- ప్రచారం ఆపి బాధితులకు నగదు, రైతులకు పరిహారం వెంటనే ఇవ్వాలని డిమాండ్లు
- ఏ విపత్తు వచ్చినా బాబుది ప్రచారయావ తప్ప చిత్తశుద్ధి లేదని వైయస్సార్ సీపీ ధ్వజం

తుపాను తీరం దాటకముందే అద్భుతాల ప్రచారమా?

అర్నబ్ తుపాను అక్టోబర్ 28 ఉదయం 10.14 గంటలకు తీరం దాటిందని వెర్కొంటున్న నేపథ్యంలో, అంతకుముందే చంద్రబాబు ప్రజలను కాపాడేశారంటూ జాతీయస్థాయిలో ప్రచారం మొదలుపెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మీడియా సంస్థల ద్వారా డబ్బులు వెచ్చించి ప్రచార కథనాలు, సోషల్ మీడియా పోస్టులు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఆర్టీజీఎస్‌లో సీసీ కెమెరాల ద్వారా చంద్రబాబు తుపాను పరిస్థితులను పరిశీలిస్తున్నారంటూ ప్రచారం చేయడం విడ్డూరంగా ఉంది. లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటే, గ్రామాల్లో విద్యుత్, రవాణా సౌకర్యాలు నిలిచిపోతే.. సీసీ కెమెరాల్లో చూసి నష్టాన్ని ఎలా అంచనా వేస్తారు? రైతుల పొలాల్లోకి వెళ్లకుండా వాస్తవ నష్టం ఎలా తెలుస్తుంది? తుపాను తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు, వరదల ప్రమాదం కొనసాగుతుంది. పూర్తిస్థాయిలో నష్టం అంచనా వేయకముందే విజయోత్సవ ప్రచారం చేసుకోవడం బాధ్యతారాహిత్యమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

02

ఒక్కరోజు ముందు రివ్యూలు.. ముందస్తు చర్యలేవీ?

తుపాను ముప్పు ముందుగానే తెలిసినా అధికారులతో సమగ్ర సమీక్షలు నిర్వహించడం, మంత్రులకు బాధ్యతలు అప్పగించడం, పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించడంపై ప్రభుత్వం తగిన దృష్టి పెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. తుపానుకు ఒక్కరోజు ముందు హడావిడి సమీక్షలతో సరిపెట్టారు. బాధితులకు ఎలాంటి సహాయం అందిస్తారో స్పష్టంగా ప్రకటించకుండానే అద్భుతంగా పనిచేస్తున్నామంటూ ప్రచారం చేసుకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.